## 161వ అధ్యాయం

## ١٦١ - بَابُ الدُّعَاءِ لِلْمَيِّتِ بَعْدَ دَفْنِهِ وَالْقُعُودِ عِنْدَ قَبْرِهِ سَاعَةً لِلدُّعَاءِ لَهُ وَالاسْتِغْفَارِ وَالْقِرَاءَةِ

## మృతుణ్ణి ఖననం చేసిన తర్వాత అతని శ్రేయస్సు కొరకు ప్రార్థించటం, కాసేపు అతని సమాధి దగ్గర కూర్చొని అతని మన్నింపు కోసం ప్రార్థించటం, ఖుర్ఆన్ పారాయణం చేయటం గురించి....

٩٤٦ - عن أبي عَمرو - وقيل: أبو عبدِ الله، وقيل: أبو لَيْلى - عُثْمَانَ بنِ عَفَّانَ رضي الله عنه قال: كَانَ النَّبِيُّ ﷺ إذا فَرَغَ مِنْ دَفنِ المَيِّتِ وَقَفَ عَلَيهِ، وقال: «استَغفِرُوا لأَخِيكُم وسَلُوا لَهُ التَّثْبِيتَ، فَإِنَّهُ الآنَ يُسأَلُ» رواه أبو داود.

946. హజ్రత్ అబూ అమ్ర్ లేక అబూ అబ్దుల్లాహ్ లేక అబూ లైలా ఉస్మాన్ బిన్ అప్ఫాన్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లం) మృతుని ఖనన సంస్కారాలు ముగిశాక అతని సమాధి దగ్గర నిలబడి (తన సహచరుల్ని ఉద్దేశ్యించి) "మీ సోదరుని మన్నింపు కోసం ప్రార్థించండి. ఇప్పుడతన్ని విచారించటం జరుగుతుంది. కనుక మీరు అతనికి స్థిరత్వం లభించాలని కోరుకోండి" అని ఆదేశించే వారు. *(అబూ దావూద్)*

*(సుననె అబూ దావూద్‌లోని జనాయెజ్ ప్రకరణం)*

### ముఖ్యాంశాలు

మృతుణ్ణి సమాధిలో పూడ్చిపెట్టిన తర్వాత దైవదూతలు వచ్చి అతన్ని సంక్షిప్తంగా విచారిస్తారు. అలాంటప్పుడు దేవుడు విశ్వాసులైన దాసులకు దైవదూతలు అడిగే ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పే సామర్థ్యాన్ని ప్రసాదిస్తాడు. దాంతో వారు ఏమాత్రం భయపడకుండా తమ ప్రభువు అల్లాహ్ అనీ, తమ ధర్మం ఇస్లాం అనీ, తమ ప్రవక్త ముహమ్మద్ (సల్లం) అని చెబుతారు. కాని అవిశ్వాసులు సమాధిలో తమను విచారించినప్పుడు దైవదూతలు అడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పలేక నెత్తీనోరు బాదుకుంటారు. పశ్చాత్తాపంతో కుమిలిపోతారు. అందుకే మృతుణ్ణి ఖననం చేసిన తర్వాత కాసేపు సమాధి దగ్గర నిలబడి అతని శ్రేయస్సు కోసం, మన్నింపు కోసం, స్థిరత్వం కోసం ప్రార్థించాలని హదీసుల్లో తాకీదు చేయబడింది.

947. హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) (తన వారసుణ్ణి) ఇలా కోరారు : (నా మరణానంతరం) నన్ను ఖననం చేసినప్పుడు మీరు ఒక ఒంటెను కోసి దాని మాంసాన్ని పంచిపెట్టినంతసేపు నా సమాధి చుట్టూ నించోండి. దానివల్ల నాక్కాస్త ధైర్యం లభిస్తుంది. నా ప్రభువు పంపే దూతలకు నేనేం జవాబు చెబుతానో తెలుసుకుంటాను." (ముస్లిం)

٩٤٧ ـ وعن عمرو بن العاص رضي الله عنه قال: إذا دفنتموني، فَأَقِيمُوا حَوْلَ قَبرِي قَدْرَ مَا تُنحَرُ جَزُورٌ، وَيُقَسَّمُ لَحْمُها حَتى أَسْتأْنِسَ بِكم، وَأَعْلَمَ مَاذا أُرَاجِعُ بِهِ رُسُلَ رَبِّي. رواه مسلم. وقد سبق بطوله. قال الشَّافِعِيُّ رَحِمَهُ الله: وَيُسْتَحَبُّ أَن يُقْرَأَ عِنْدَهُ شيءٌ مِنَ القُرآنِ، وَإِن خَتَمُوا القُرآن عِنْدَهُ كَانَ حَسَناً.

ఈ ఉల్లేఖనం ఇంతకుముందు వివరంగా వచ్చింది.

ఇమామ్ షాఫయీ (రహ్మాలై) ఇలా అన్నారు: సమాధి దగ్గర కాసేపు ఖుర్ఆన్ పారాయణం చేయటం అభిలషణీయం. ఖుర్ఆన్ మొత్తం పారాయణం చేస్తే ఇంకా మంచిది.

*(సహీహ్ ముస్లింలోని విశ్వాస ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

మృతుణ్ణి ఖననం చేసిన తర్వాత సమాధి దగ్గర నిలబడి మృతుని మన్నింపు కోసం, మనస్థయిర్యం కోసం ప్రార్థించాలని దైవప్రవక్త (సల్లం) విధానం ద్వారా తెలుస్తోంది. సదరు హదీసులో దైవప్రవక్త అనుచరుడు అమ్ర్ బిన్ ఆస్ (రజి) కూడా దాని గురించే ఆదేశించారు.

ఇకపోతే ఇమామ్ షాఫయి (రహ్మాలై) చెప్పినట్లు సమాధి దగ్గర ఖుర్ఆన్ పారాయణం చేయటం మాత్రం సరయిన పద్ధతి కాదు. దైవప్రవక్త (సల్లం)గాని, ఆయన అనుచరులు గాని ఆ విధంగా చేసినట్లు ఆధారాలు లేవు. సమాధి దగ్గర కేవలం దుఆ చేయటమే మస్నూన్ పద్ధతి. దానికి మించి ప్రవర్తిస్తే ప్రవక్త విధానాన్ని ఉల్లంఘించినట్లవుతుంది. ఇంకో విషయం ఏమిటంటే, అసలు ఇమామ్ షాఫయి (రహ్మాలై) ఆ మాట అన్నారని కూడా పూర్తి నమ్మకంగా చెప్పలేం. ఎందుకంటే, ఫత్హుల్ బారీ, తఫ్సీర్ ఇబ్నె కసీర్ ఇంకా ఇతర గ్రంథాల ద్వారా ఇమామ్ షాఫయీ (రహ్మాలై) ఖుర్ఆన్ పారాయణం చేసి మృతులకు పుణ్యసమర్పణ (ఈసాలె సవాబ్) చేసే పద్ధతికి సుముఖంగా లేరని తెలుస్తోంది.